క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



నవాబుపేట: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూనే ఉంటామని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్‌యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని కూచూర్, యన్మన్‌గండ్ల, నవాబుపేట, ఇప్పటూర్ గ్రామాల పాఠశాలల్లో సంఘం సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెందిన పీఆర్‌సీపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగ్యానాయక్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి విజయ్‌కుమార్ గౌడ్, సదాశివుడు, కృష్ణ, శ్రీనివాస్, ఆరుణ, మల్లికార్జున్ రాజు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలి

జడ్చర్ల టౌన్: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై మాచారం సమీపంలో ఉన్న మిడ్‌ల్యాండ్ పాఠశాలగా గుర్తింపు పొంది, మిడ్‌ల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో ప్రచారం చేస్తూ స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈఓ మంజులాదేవికి ఫిర్యాదు చేశారు. పాఠశాలకు గ్రౌండ్ లేదని, సెల్లార్‌ను చూయించి గ్రౌండ్‌గా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పొందుపర్చారు. జాతీయ రహదారి పక్కనే ఉన్నప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని, స్కూల్‌జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని వివరించారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, నరేష్, యాదవ్, కిరణ్‌రెడ్డిలు కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నవాబుపేట: సైబర్ నేరాల పట్ల యువత అవగాహన పొందాల్సిన అవసరం ఉందని ఏఎస్ఐ జనార్దన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉంచాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపటం నేరమని, ఇందులో వారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు సైతం ఈ చట్టం ఉల్లంఘనలోకి వస్తారని ఆయన వివరించారు. ఫోన్లలో వచ్చే అనవసర మెసేజ్‌లకు స్పందిస్తే ఖాతాల్లో ఉన్న డబ్బులు పోతాయని, ఫోన్లలో వచ్చే ప్రతి విషయానికి స్పందించకూడదన్నారు.

యూరియా కోసం రైతుల ఇక్కట్లు



మిడ్జిల్: మండలంలో యూరియా సకాలంలో అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద గురువారం యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. ఒక రైతుకు 3 బస్తాలు ఇస్తుండడంతో మండలంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడంతో యూరియా వినియోగం పెరిగింది. గురువారం ఒక రోజు 600 బస్తాల యూరియా సరఫరా చేసినట్లు కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సహకార సంఘునకు, మిడ్జిల్, రానిపేట్ హకా సెంటర్లకు, కొత్తూర్ రైతు అగ్రోస్‌కు క్రమం తప్పకుండా వస్తుందని తెలిపారు. యూరియా కొరత ఎక్కడా లేదని తెలిపారు.

సూచికలు లేకుండా రహదారి విస్తరణ పనులు



భూత్పూర్: మండలంలోని శేరిపల్లి (బి) వద్ద జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -44) పైసూచికల బోర్డులు లేకుండా విస్తరణ పనులు చేపట్టారు. రహదారి అధికారుల పర్యవేక్షణ లోపంతో సదరు కాంట్రాక్టర్ సూచికల బోర్డులు నామ మాత్రంగా ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. దివిటిపల్లి వద్ద జాతీయ రహదారిపై వంతెన నిర్మాణం పనులు సాగుతుండటంతో శని, ఆదివారాల్లో కిలోమీటర్ల మేర రహదారిపై ఇరువైపులా నిలిచిపోతున్నాయి. శేరిపల్లి (బి) వంతెన నిర్మాణం పనుల్లో భాగంగా ఇంటర్నల్ రహదారి పనులు ఇరువైపులా కొనసాగుతున్నాయి.కొన్ని చోట్ల చిన్న పాటి సంచులు రహదారి పక్కన ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి భద్రత చేపట్టే ఎల్‌అండ్‌టీ అధికారులు సైతం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి అధికారులు చొరవ తీసుకొని సూచికల బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి
- రాష్ట్రాభివృద్ధిలో మహిళలకు భాగస్వామ్యం
- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ విజయేందిర,తదితరులు

దేవరకద్ర: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని, అందుకు అనుగుణంగా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు వడ్డీలేని రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని దేవరకద్ర, అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, కొౌకుంట్ల, చిన్నచింతకుంట మండలాలకు సంబంధించిన ఇందిరా మహిళాశక్తి సంబరాలు గురువారం దేవరకద్రలోని శ్రీనివాసగార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. దేశ ప్రధానిగా పని చేసిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ మహిళలకు ఆదర్శమన్నారు. ఇందిరా గాంధీ ప్రధానిగా దేశంలో భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ, గరిబీ హటావో నినాదంతో ఎన్నో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తుంతుందన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ నిర్మాణం మహిళల పేరు మీద మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలోని చిన్నచింతకుంట, అడ్డాకుల, భూత్పూర్ మండలాల మహిళలకు బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరిగిందన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకోడానికి హైదరాబాద్‌లోని శిల్పారామంలో స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘం సభ్యులుగా ఉండి ప్రమాదంలో మృతి చెందితే రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అందిస్తున్నామన్నారు.

మహిళలకు సోలార్ ప్లాంట్లు..

కార్పొరేట్లకే పరిమితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను మండలాల వారీగా మహిళా సమాఖ్యలకు అప్పగిస్తామన్నారు. పెట్రోల్ బంకులను మహిళా సంఘాలకు కేటాయిస్తామని తెలిపారు. దేవరకద్రలో వంద పడకల ఆస్పత్రి, కొత్తకోటలో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణం పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేసే విధంగా పని చేస్తున్నామన్నారు.

రూ. 25.20 కోట్ల చెక్కుల పంపిణీ

దేవరకద్రలోని 255 మహిళా సంఘాలకు 25 కోట్ల 20 లక్షల 25 వేల చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర శివేంద్ర ప్రతాప్‌లు అందజేశారు. 2487 సంఘాలకు రూ. 2.78 కోట్ల వడ్డీలేని రుణాల చెక్‌ను, లోన్ బీమా కింద 31 మందికి రూ.18.09 లక్షల చెక్‌ను, మూడు మండలాల అద్దె బస్సులకు సంబంధించి వచ్చిన ఆదాయం 2.08 లక్షల చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నరసింహులు, ప్రత్యేక అధికారి శంకరాచారి, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కతలప్ప, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కోనరాజశేఖర్, నాగిరెడ్డి, హన్మంతరెడ్డి, కిషన్‌రావు, వివిధ మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, ఏపీఎంలు పాల్గొన్నారు.

మీ సొమ్ము ఎక్కడ?

'మా నియోజకవర్గానికి ఇద్దరు, ముగ్గురిని చేర్చుకోవడానికి వచ్చి సొమ్మొకడిది సోకోకడిది అని మాట్లడడం ఎక్కడ ఉంది. మా సొమ్మును మీరు దోచుకు పోతున్నారు అని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరోక్షంగా ఎంపీ డీకే అరుణ మాటలను ఖండిస్తూ గురువారం విలేకరులతో మాట్లాడారు. మేము రూపాయి పన్ను కడితే 46 పైసలు ఇస్తున్నారని విమర్శించారు. కేంద్రం నుంచి మనకు రావల్సిన దాని గురించి కొట్లాడడం పోయి ఇక్కడ వచ్చి మాట్లాడడంపై అర్థం ఉండాలన్నారు. మీరు తెలంగాణకు చేసింది ఏముందని, రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపిస్తే అందులో ఇద్దరు మంత్రులు ఉన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటాపై ఎక్కడ ఫైట్ చేస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను, ప్రధానిని కలిసి సమస్యలు చెప్పి నిధులు ఇవ్వాలని కోరారు. మీరు రాష్ట్రానికి రావల్సిన నిధులు, వాటా ఇవ్వాలని కోరిన దాఖలాలు లేవని ఆరోపించారు. మీ సొమ్ము అయితే కేంద్రం నుంచి తెచ్చి మాట్లాడాలని కోరారు. నియోజకవర్గానికి నవోదయ స్కూల్ తీసుకురండి, కావలిసిన భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వాన్ని ఒప్పించి భూమిని కేటాయిస్తాం. వచ్చే పథకాల గురించి సహకరించకుండా మేము ప్రజలకు ఇస్తున్న పథకాలు చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారని విమర్శించారు. పలు రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉంది, అక్కడ సన్న బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజలను మభ్య పెట్టడానికి మాయచేసి మాట్లాడడం సరి కాదన్నారు. బీజేపీ ఎక్కడ ఉంది, ఆ పార్టీ గురించి ఆలోచన కూడా లేదని అన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత..

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత నిస్తున్నామని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మహిళా శక్తి ద్వారా గత ఏడాది నుంచి మహిళా శక్తి క్యాంటీన్‌లు, బ్యాంకు లింకేజీ స్త్రీ నిధి రుణం, పౌల్ట్రీ ఫామ్, సోలార్ పవర్ ప్లాంట్‌లు, గోదాంల నిర్వహణ, పెట్రోల్ బంకుల ఏర్పాటు చేసి వారిని ఆర్థిక వృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సబ్ సెంటర్‌లు, పాఠశాలలు బాగా పని చేసే విధంగా మహిళా సంఘాలు చూడాలని కోరారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



నివాళ్ళుర్పిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాట్రావత్ ప్రియాంక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గతంలో కాట్రావత్ ప్రియాంక క్యాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని సంప్రదించగా ఆమె వెంటనే స్పందించి రూ.10.50లక్షలు సీఎం నిధి ద్వారా తక్షణ సహాయం మంజూరు చేయించినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తు చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడం బాధాకరమన్నారు.

వికలాంగుల హామీలను నెరవేర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగన్న

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పింఛన్లు రూ.6 వేలు, అన్ని రకాల పింఛన్లు రూ.4 వేలకు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి రాగానే వాటిని నెరవేర్చకుండా మోసం చేస్తోందన్నారు. ఈనెల 20న జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో సన్నాహక జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు పద్మశ్రీ మందకృష్ణమాదిగ విచ్చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో నరేందర్, బుచ్చయ్యనాయక్, చెన్నకేశవులు, శ్రీనివాసులు, జైపాల్‌రెడ్డి, యాదయ్య, నాగరాజు, శ్రీరాములు, రామచందర్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు మహబూబ్‌నగర్ రూరల్ మండలం శాఖ ఆధ్వర్యంలో ధర్మాపూర్, కోడూర్, రామచంద్రపూర్, కోడూర్, రాంచంద్రాపూర్, మణికొండ, బొక్కలోనిపల్లి, పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు బుచ్చారెడ్డి, మాజీ అధ్యక్షుడు నారాయణగౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, మధుసూదన్, సీతారాములు, అంజయ్య, అరవింద్, నాగేశ్వర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కోయిల్‌కొండ: స్థానిక సంస్థ ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చని బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యమత్యంగా ఉండి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరభద్ర స్వామి దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలపర్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాయకులు బచ్చిరెడ్డి, కృష్ణయ్య, కరుణాకర్‌రెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మోదీపూర్ రవి, నారాయణ, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై చర్యలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవిధంగా చూడాలని, 50 మందికిపైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో కనీసం తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, 100 మంది విద్యార్థులుంటే ఒక హెచ్‌ఎం 6 మంది టీచర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. జెడ్పీ హెచ్ఎస్ గూరకొండ, చౌదూర్, పోతన్‌పల్లి పాఠశాలల్లో పండిత, సబ్జెక్టు టీచర్‌లను సర్దుబాటులో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూపతిసింగ్, రమాకాంత్ ప్రసాద్, శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలు



మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ అనుమతితో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలు గాలికి వదిలేసి విద్యను వ్యాపారంగా మలుచుకున్నాయని మాలల చైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు అన్నారు. అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదయ్య, వెంకట్రాములు, చెన్నకేశవులు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గండీడ్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దవార్వాల్‌లో పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా భీమోజీ, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఈటె చెన్నయ్య, కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా గొల్ల ఆశన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వద్దె రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నర్సింహ్మారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు పుల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు మన్యపురెడ్డి, మండల నాయకులు మాలెలవెంకన్నగౌడ్, అంజిలయ్య, చెన్నారం దస్తయ్య, దిగంబర్‌రావు, వీరన్న పాల్గొన్నారు.

అవమానించడమే ప్రభుత్వ లక్ష్యం



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను అవమానించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ శివారులో సర్వేనంబర్ 431, 431/1, 433 అసైన్డ్ భూముల హక్కుల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 4వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు సందర్శించి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన దీక్షలకు మద్దతు తెలిపారు. దీక్షలో జ్ఞాన నీలి మహనీయుల శోభయాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దెల్లి జంబులయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జైభీమ్ సేనా అధ్యక్షుడు నరేందర్, జయమ్మ, రమేష్, కాలె నరేందర్, యాదయ్య, మొగులయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా పాలకవర్గం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు రంగారావుతోటలో సీసీ రోడ్ల నిర్మాణానికి కమిషనర్ లక్ష్మారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. తమ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైయినే జీ నిర్మాణం, సీసీ రోడ్లు పనులు చేసుకుంటున్నామన్నారు.కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకు ని లో ఓల్టేజీ సమస్య పరిష్కారం చేసుకున్నామన్నారు.

3వవార్డులో సమస్యలు తీర్చాలని వినతి

మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సమస్యలు తీర్చాలని కాలని అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ము న్సిపల్ చైర్‌పర్సన్, కమీషనర్‌లను వేరు వేరుగా క లుసుకుని వినతిపత్రం సమర్పించారు. కాలనిని అన్ని రంగాలుగా అభివృద్ధి చేయాలని వారు విన్నవించారు.

జడ్చర్లలో సీపీఐ 23వ జిల్లా మహాసభలు



జడ్చర్ల: జడ్చర్లలో వచ్చే నెల 5,6 తేదీలలో సీపీఐ మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కళాభవనంలో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి బాలనర్సింహ, తదితరులు హాజరవుతారన్నారు. సభలు విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగి కృష్ణయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సిరాజ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, నాయకులు ఖలీం, మన్సూర్ పాల్గొన్నారు.

పెద్దగుట్ట టెండరు రూ.1.31లక్షలు



జడ్చర్ల టౌన్: శ్రావణమాసంలో పెద్దగుట్టపై నిర్వహించే ఉత్సవాల కోసం గురువారం పాతబజార్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఓపెన్ టెండరు వేలంలో రూ.1.31లక్షల ఆదాయం వచ్చింది. ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి, నాయకులు పి.మురళి, వార్డుకౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ టెండరులో లడ్డు, పులిహోర టెండరు ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్ రూ.80వేలకు దక్కించుకోగా, టెంకాయలు, తైబజార్ వేలంను కట్ట మురళి రూ.51వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, సత్యం, ఎడ్లరవిగౌడ్, వెంకటేశ్, అంజిబాబు, అనిత, కాల్వ రాధిక, విజయ్, పిట్టల సంతోష్‌లు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

జడ్చర్ల: స్థానిక విద్యానగర్ కాలనీకి చెందిన సామ్ అరుణ్(14) బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని సీఐ కమలాకర్ తెలిపారు. బాలుడి తల్లి కవిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొత్తగా 1429 రేషన్‌కార్డులు

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గానికి కొత్తగా 1429 రేషన్ కార్డులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులలో అదనంగా 7943 మంది కొత్తగా చేరినట్లు పేర్కొన్నారు. అధికారుల పరిశీలనలో మరిన్ని దరఖాస్తులు ఉన్నాయని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హత ఉన్నవారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

పండగ సాయన్న ఆశయాలు కొనసాగిస్తాం



కొత్లాబాద్‌లో పండుగసాయన్న జయంతి ఉత్సవాల్లో నాయకులు

హన్వాడ: పండుగ సాయన్న ఆశయాలు కొనసాగిస్తామని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం పండగసాయన్న జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పండగ సాయన్న ఎక్కడ ఉంటే అక్కడ పండగ వాతావరణం ఉండేదని, నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉండే పండగ సాయన్న ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పరిత పించేవారన్నారు. పండగ సాయన్న ఓగొప్ప మానవతావాది, కులాలను కూడగట్టి అన్యా యాలపై పోరాడిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మాజీ ఎంపీపీ బాల్‌రాజు, మాజీ సర్పంచ్ చెన్న య్య, మాజీ జెడ్పీటీసీ నరేందర్, బాలయ్య, లక్ష్మయ్య, యాదయ్య, నర్సింహులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పండగసాయన్న జయంతి వేడుకలు

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రజావీరుడు పండగసాయన్న జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరణ

దేవరకద్ర: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం జరిగిన వారంతపు సమావేశాన్ని ఉపాధి సిబ్బందితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ పిలుపు మేరకు సమావేశాన్ని బహిష్కరించి ఎంపీడీఓ, ఎంపీఓలకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలల నుంచి వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

విధులకు రాకుండానే నెలనెలా జీతం

- హెచ్‌ఎంపై ఆరోపణలు
- విచారణ అధికారిగా ఎంఈఓ



నేలబండతండా పాఠశాలను సందర్శించిన స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ విధులకు హాజరు కాకుండా ఎంఈడీ కోర్సు చేస్తూ జీతం తీసుకుందని ఎస్ఎఫ్ఐ చేసిన ఆరోపణల నేపథ్యంలో విచారణ అధికారిగా ఎంఈఓ మంజులాదేవిని నియమిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. విధులకు హాజరు కాకుండా హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేశారని ఎస్ఎఫ్ఐ నాయకుడు భరత్ ఆరోపించారు. 2022–24 ఏడాదిలో ఆల్ మదిన కళాశాలలో రెగ్యులర్ ఎంఈడీ కోర్సు చేశారని, వారు హాల్‌టికెట్ నంబరును పొందుపరుస్తూ ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో సెలవులు పెట్టినట్లు లేదని, దొంగ సంతకాలు చేసి జీతం పొందారన్న ఆరోపణలు చేశారు.

పాఠశాల మూసివేత ఎవరికోసం

రాష్ట్రంలో ఓ పక్క మూసివేసిన పాఠశాలలను తెరవాలని ఆదేశాలుంటే జడ్చర్ల మండలం మాత్రం పిల్లలు లేరనే సాకు చూపుతూ మండలంలోని నేలబండతండా పాఠశాల మూసి వేశారని ఎస్ఎఫ్ఐ నాయకుడు భరత్ ఆరోపించారు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రాధికను యూపీఎస్ ఉదండాపూర్‌కు ఓరల్ డెప్యుటేషన్ వేశారని, అయితే ఆ పాఠశాలకు అదనపు ఉపాధ్యాయురాలు అవసరం లేదని, జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకుడి మెప్పుకోసం అధికారులు ఇలా చేశారని భరత్ ఆరోపించారు. వెంటనే మూసివేసిన పాఠశాలను తెరిపించాలని, అందుకు ఓరల్ డెప్యుటేషన్ రద్దుచేయాలని కోరారు. పాఠశాల సందర్శించిన స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు నేపథ్యంలో స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు నేలబండతండా పాఠశాలను సందర్శించారు. అక్కడి తండావాసులతో మాట్లాడి విద్యార్థులు వచ్చేలా చాటింపువేయాలని నిర్ణయించారు. గురువా రం తండావాసులతో సమావేశమై విద్యార్థులు వచ్చేట్లయితే పాఠశాల పునఃప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. బడిబాట తరువాత తండాలో విద్యార్థులు పాఠశాలకు రావటం లేదని గుర్తించి డీఈఓ, ఎంఈఓ ఆదేశాల మేరకు ఉదండాపూర్ యూపీఎస్‌కు ఉపాధ్యాయురాలును పంపినట్లు ఆయన తెలిపారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

జడ్చర్ల టౌన్: దేవునిగుట్టతండాలో గురువారం అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా.మనుప్రియ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత గూర్చి అవగాహన కల్పించారు. వర్షాకాలం వచ్చే వ్యాధులగూర్చి వివరించారు. వంటలో వాడే అయోడిన్ ఉప్పును పరీక్ష చేశారు. తాగునీటి పాట్‌ను పరిశీలించి వాటర్ శాంపిల్ సేకరించి హస్టల్ పరిసరాలు పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.